# స్ఫూర్తి

రాఘువి




మదర్ థెరిసా అనాథాశ్రమానికి వచ్చి అప్పటికి పది నిమిషాలు దాటింది. సిస్టర్ మేరీ అర్జెంట్ పని మీద బయటకు వెళ్లడంతో నాలో కాస్త నిరాశ ఆవహించింది. నా భర్త ఆనంద్ ఆమె రాక కోసం ఎదురుచూస్తూ అటు, ఇటు పచార్లు చేస్తున్నాడు. నేను వెయిటింగ్‌రూమ్‌లో కూర్చుని విండో లోనుంచి అక్కడ పరిసరాలు గమనించసాగాను.

ఈ ఆశ్రమం చతురస్రాకార మోడల్‌లో ఉండి చుట్టూ క్రోటన్స్ మొక్కలతో మధ్యలో పూలమొక్కలతో చాలా నీట్‌గా ఉంటుంది. ఆ పూల మొక్కల మధ్యలో తెల్లని మదర్ థెరిసా విగ్రహం శాంతిదూతలా ఉంటుంది.

ఆశ్రమంలో ఉన్న సిస్టర్స్, ఆయాలు ఎంతో ప్రేమతో, క్రమశిక్షణతో పిల్లల సంరక్షణ చూస్తారు. వారి ముఖాలు అలసట కనిపించకుండా ఎంతో ప్రశాంతంగా, చిరునవ్వుతో ఉంటాయి.

ఇంతలో సిస్టర్ నిర్మల వచ్చి "సిస్టర్ మేరీ ఒక ఫైవ్‌మినిట్స్‌లో ఇక్కడ ఉంటానని చెప్పమన్నారని, మిమ్మల్ని వెయిట్ చేయించినందుకు ఏమీ అనుకోవద్దని అన్నారని" చెప్పింది.

"ఒ.కే. సిస్టర్ నో ప్రాబ్లమ్" అన్నాడు ఆనంద్.

మేము తీసుకువెళ్లబోయే పింకీని లోపల సిస్టర్స్ రెడీ చేస్తున్నారు. పింకీని మాతో పంపించడం బాధగా ఉన్నట్లు వాళ్ల మొహాలు చెప్తున్నాయి. నిజంగా ఇక్కడ వాళ్ల మంచి మనసులకు నాకు జోహార్లు చెప్పాలనిపిస్తుంది. తను పిల్లలు కాని ఇంత మంది పిల్లలను తమ సొంత పిల్లల్లా సాకుతున్నారంటే వాళ్లది ఎంత గొప్ప హృదయం! నెలల వయసున్న పిల్లలను వాళ్ల కన్నవాళ్లు రోడ్డుపై వదిలేస్తే ఆ పిల్లలకు సొంత తల్లులై పెంచటం నిజంగా గ్రేట్!

అంతగా కన్నవాళ్లకు పిల్లలు భారంగా తోస్తే అసలు వాళ్లను కనడం ఎందుకు? ఇలా అనాథలుగా వదిలివేయడం ఎందుకు? ఈ విషయం గురించి తను ఆలోచించినప్పుడల్లా తెలియని బాధ, ఉద్వేగం చుట్టేస్తుంటాయి. పెద్దవాళ్లు చేసిన నేరానికి పసివాళ్లు శిక్ష అనుభవించాలా! ఇదెక్కడి న్యాయం? ఇంకా నయం... ఈ ప్రపంచంలో కొంచెమైనా మానవత్వం మిగిలి ఉందంటూ ఇటువంటి ఆశ్రమాలు నిరూపిస్తున్నాయి. థాంక్ గాడ్...

నాకు ఎప్పటి నుండో అనాథ అయిన బిడ్డను పెంచుకోవాలని ఉండేది. కానీ సమయం గురించి వేచి చూశాను. మాకు మొదటి బిడ్డ పుట్టిన కొన్నాళ్లకు ఆనంద్‌తో నా కోరిక వెలిబుచ్చాను.

"ఇంకో బిడ్డను కనే అవకాశం ఉన్నప్పుడు అనాథను పెంచుకోవడం ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మనం కన్నబాబు ఒకడున్నాడు కదా... ఈ ప్రపంచంలో తల్లిదండ్రులు లేక ఒంటరియైన పసివాళ్లు ఎందరో ఉన్నారు. అలాంటి వాళ్లలో ఒకరిని మనం పెంచుకుంటే వారికి మంచి జీవితం ఇచ్చిన తృప్తి మనకుంటుంది కదా!" అన్నాను.

ఆనంద్ ఆలోచనల్లో పడ్డాడు. అతని వ్యక్తిత్వం మీద నమ్మకం ఉండబట్టి నేను ఆ కోరిక కోరాను. 'చూద్దాం' అన్నట్లు ఊరుకున్నాడు.

కానీ నా పట్టుదల వీడకపోవటంతో "చూడు... నిజమా... నువ్వనుకున్నది అంత ఈజీ కాదు. ఏ రక్త సంబంధం లేని బిడ్డను కన్నబిడ్డలా చూసుకోవాలంటే గొప్ప మనసుండాలి. ఎంతో ప్రేమ, సహనం కలిగి ఉండాలి. తోటి వ్యక్తుల మాటలను ఎదుర్కొనే శక్తి ఉండాలి" అన్నాడు.

"నేను అవన్నీ భరిస్తాను" చాలా కాన్ఫిడెంట్‌గా అన్నాను. సూటిగా నా మొహంలోకి చూశాడు. నా కళ్లలో కనిపించిన నమ్మకం చూసి సరేనని ఒప్పుకున్నాడు. నా సంతోషానికి హద్దు లేకుండా పోయింది.

ఎప్పుడైతే ఆనంద్ ఒప్పుకున్నాడో వెంటనే అనాథాశ్రమానికి వెళ్లాను. అక్కడ సిస్టర్ మేరీని కలిసి నా కోరిక చెప్పాను. ఆవిడ నా డిటైల్స్ అన్నీ అడిగింది. ఆపై తన సంతోషం వ్యక్తపరచి లోపల రూమ్స్‌లోనికి వెళ్లి పిల్లను చూడమంది. నేను అక్కడ రూమ్స్ అన్నీ గమనించి ఒక రూమ్‌లోనికి అడుగుపెడుతుండగా హఠాత్తుగా ఒక సంవత్సరన్నర వయసున్న పాప నా కాళ్లకు గట్టిగా బంధం వేసి ఏడవసాగింది. ఆ పాపను ఎత్తుకుని సముదాయించసాగాను. ఆయా వచ్చి "ఈ రోజు పింకీ అన్నం తిననని మారాం చేస్తుంది" అని సిస్టర్‌కి కంప్లైంట్ చేసింది. చక్కని చుక్కలా ఉన్న ఆ పాపను ఎత్తుకుని అన్నం నేను తినిపిస్తానని ఆయా దగ్గర నుండి తీసుకున్నాను. బుద్ధిగా నా దగ్గర పింకీ అన్నం తినేసింది. సిస్టర్ చాలా సంతోషించింది.

"మీరు ఒక గొప్ప ఆఫీసరై యుండి పాపను చాలా బాగా హ్యాండిల్ చేశారు" మెచ్చుకుంది సిస్టర్.

"నేనూ తల్లిననే విషయం మీరు మరచిపోయినట్లున్నారు సిస్టర్" అన్నాను నవ్వి. సిస్టర్ కూడా నవ్వింది.

నన్ను తొలిచూపులోనే కట్టిపడేసిన పింకీ పట్ల నాకు తెలియని బంధం ఏర్పడింది. మా ఇద్దరి బంధం ఈనాటిది కాదు అనిపించింది.

ఆ విషయమే సిస్టర్‌తో అని వారానికి రెండుసార్లైనా వచ్చి పింకీని బాగా అలవాటు చేసుకున్నాక ఇంటికి తీసుకువెళతానని చెప్పాను.

సంతోషంగా తలూపిందామె. అప్పటి నుండి ఎప్పుడు హాలీడే అయితే అప్పుడు పింకీ దగ్గరకు వెళ్లి తనతో ఆటలాడేదానిని. అలా తను నాకు బాగా అలవాటయ్యింది. ఇక ఇంటికి తీసుకువెళ్లే సమయం ఇదేనని తలచి ఆనంద్‌కి చెప్పాను. నా ముఖంలోకి పరిశీలనగా చూశాడు.

"నీకిష్టం లేకపోతే వద్దులే" అన్నాను నెమ్మదిగా.

"అదికాదు విజ్జీ... నాకేం అభ్యంతరం లేదు. తరువాత జరిగే పరిణామాలను నువ్వెలా ఫేస్ చేస్తావనే నా ఆందోళన" అన్నాడు.

"నేను నీ గురించి తప్పా, వేరే ఎవరినీ పట్టించుకోను. ప్రామిస్" అన్నాను.

"ఓ.కే..గుడ్.. అయితే రేపే వెళ్లి తీసుకువద్దాం" అన్నాడు.

సిస్టర్ మేరీ హడావిడిగా వస్తూనే "సారీ మేడమ్, సారీ సర్... చాలా ముఖ్యమైన పనిమీద బయటకు వెళ్లవలసి వచ్చింది" అంది సంజాయిషీగా.



"ఫర్వాలేదు సిస్టర్... పింకీని తీసుకువెళ్లడానికి ఏవో ఫార్మాలిటీస్ ఉంటాయిగా అవి తొందరగా పూర్తి చేస్తే..." అన్నాడు.

"నేను అవన్నీ ముందే రెడీ చేసి ఉంచాను. మీ వైఫ్ అండ్ హజ్బెండ్ ఇద్దరూ సైన్ చేస్తే చాలు" అని కొన్ని పేపర్స్ ఇచ్చారామె.

మేమిద్దరం సైన్ పెట్టాం. పింకీని తీసుకొచ్చారు. నేను తెచ్చిన రోజ్‌కలర్ ఫ్రాక్‌లో పేరుకు తగ్గట్టు ముద్దుగా ఉంది. ఆనంద్ పింకీని ఎత్తుకున్నాడు.

ఆశ్రమంలో అందరి దగ్గరా వీడ్కోలు తీసుకుని బయలుదేరాం. అందరి మొహాలు సంతోషంగానూ, కాస్త విచారంగానూ ఉన్నాయి. ఇంటికి వెళ్లేదారిలో మా బుడతడు సంజూ స్కూలుకి వెళ్లి వాడ్ని మాతో బాటు తీసుకువచ్చేశాం.

"సంజూ... నీకు చెల్లెల్ని తీసుకువచ్చాం. బాగుందా!" అడిగాడు ఆనంద్.

వాడికి ఏం అర్థమైందో గానీ తలూపాడు బాగుందన్నట్లు.

* * *

పింకీ నామకరణానికి బంధువులను, నా బ్యాంక్ కొలీగ్స్‌ను, ఆనంద్ తన కంపెనీతో ఉద్యోగులందరినీ పిలిచాం. అందరూ వచ్చారు. 'ఆకృతి' అని నామకరణం చేశాం.

అందరూ రకరకాల గిఫ్ట్స్ తీసుకు వచ్చారు. మేం ఎవరి నుండి కూడా అవి స్వీకరించలేదు. "ఆకృతికి మీ ఆశీస్సులు చాలు" అన్నాం.

నా కొలీగ్స్, ఆయన ఫ్రెండ్స్ అందరూ మమ్మల్ని చాలా ఎప్రిసియేట్ చేశారు. వాళ్ల కాంప్లిమెంట్స్‌ని సున్నితంగా తిరస్కరించాం.

నా ప్రాణ స్నేహితురాలు శృతి వచ్చింది. "విజయా... చాలా మంచి పని చేశావ్... నీలా అందరూ ఆలోచించి ఈ లోకంలో ఉన్న అనాథపిల్లలను దత్తత తీసుకుంటే అనాథ అనబడే వాళ్లే ఉండరు కదా! నా ఆర్థిక పరిస్థితి బాగుండక గానీ లేకపోతే నీలా నాకూ ఒక పాపను దత్తత తీసుకోవాలనుంది" అంది ఉద్వేగంగా.

"శృతీ... నాకున్న అవకాశం అందరికీ ఉండకపోవచ్చు. కానీ వాళ్ల ఆర్థిక పరిస్థితికి తగ్గట్టు దత్తత తీసుకోలేకపోయినా వాళ్ల చదువుకు సంబంధించో, లేదా వాళ్ల కనీస అవసరాలకు సంబంధించో కొంచెం సహాయం చేసినా చాలు కదా" అన్నాను.

"నిజం... నిజమా నువ్వన్నది కరెక్ట్. నా పరిధిలో నేను ఆ పిల్లలకు తప్పకుండా సహాయం చేస్తాను" అంది దృఢనిశ్చయంతో.

* * *


పిల్లలిద్దరూ పడుకోవడంతో ఆనంద్ రాక కోసం ఎదురుచూడసాగాను. ఉదయం ఫంక్షన్‌లో జరిగిన మాటలు నా మదిలో మెదుల్తున్నాయి. అందరి నోటా ఒకటే కాంప్లిమెంట్స్. "మేడమ్... మీరు చాలా గ్రేట్. ఎవరికీ మీ అంత గొప్ప మనసుంటుంది ఒక అనాథలు ఇంతటి గొప్ప స్థానాన్ని ఎవరిస్తారు. మీ అమ్మాయి చాలా అదృష్టవంతురాలు. రియల్లీ యూవార్ గ్రేట్!" ఈ మాటల్ని పదేపదే విని వినుగు పుట్టింది.

నేను అంత గొప్ప పని ఏం చేశానని ఈ కాంప్లిమెంట్స్... నాకు దత్తత తీసుకోగల స్థోమత, పరిస్థితి ఉన్నాయి కాబట్టి చేశాను. అంతే గానీ ఇందులో నా గొప్పతనం ఏం లేదు. అదే ప్రతికూల పరిస్థితుల్లో ఒక తల్లి అనాథ శిశువును ఎవరి సహకారం లేకుండా పెంచటం కష్టం. ఎంత ధైర్యం, సహనం ఉంటే తప్పా అటువంటి పరిస్థితులను ఎదుర్కొనగలం...

ఒక గమ్యం చేరడానికి పూల బాటలో పయనించి ఆ గమ్యాన్ని

చేరుకోవడం గొప్పా! ముళ్ల బాటలో పయనించి ఆ గమ్యాన్ని చేరుకోవడం గొప్పా! ముమ్మాటికీ రెండో దారిలో పయనించి ఆ గమ్యస్థానాన్ని చేరుకున్న ఆ స్త్రీ మూర్తిదే గొప్పతనమంతా...

ఒక సాధారణ స్కూలు టీచర్ ఇంటికి వెళుతూ దారిలో చెత్తకుప్పలో దొరికిన ఒక ఆడశిశువును పెంచడానికి ఇంటికి తీసుకువెళ్తే ఇంట్లో తాగుబోతు భర్త చీత్కారం, అత్తమామల అనుమానాల చూపులు ఎదుర్కొని ఆ పసిగుడ్డును విడవడానికి ప్రాణం ఒప్పుకోక... ఇంట్లో సాధింపులు పడలేక ఎంతో నలిగి ఉంటుంది?




ఆ చిన్నపాటి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండడం వల్ల ఇంట్లో వాళ్లు ఆమెను బయటకు పంపకుండా ప్రతీరోజూ నరకం చూపించినపుడు ఎంతగా భరించి ఉంటుంది...

భర్త అనారోగ్యంతో చనిపోయినపుడు, ఆ అత్తమామలు, బంధువులు రాబందుల్లా పీక్కుతింటుంటే ఎంత సహించి ఉంటుంది! ఆ పసిగుడ్డును ఎక్కడ వాళ్లు చంపేస్తారనే భయంతో వాళ్లందరికీ దూరంగా వచ్చేసి ఒంటరిగా బ్రతకడానికి ఎంత ధైర్యం వహించి ఉంటుంది? తోటి పిల్లలందరితో కన్నా గొప్పగా చదువు, ఆట, పాటల్లో ఆ బిడ్డను తీర్చిదిద్దడానికి ఎంతగా కృషి చేసి ఉంటుంది.

ఒక అనాథ బిడ్డ కోసం ఏ తల్లి అయినా ఇంతటి కష్టాన్ని అనుభవిస్తుందా? తన జీవితం మొత్తం త్యాగం చేస్తుందా! ఇటువంటి గొప్ప మాతృమూర్తి తన తల్లి గాక వేరొకరు ఉండరు..! ఈ అభినందనలన్నీ తనని పెంచిన మాతృమూర్తికి చెందుతాయి.

ఈ సమాజంలో తనను ఒక అనాథగా బ్రతికే అవసరం లేకుండా చేసి, ఒక గౌరవమైన స్థానాన్ని ఇచ్చిన తల్లీ... నీకు జోహార్లు... శతకోటి వందనాలు.

నీ స్ఫూర్తితోనే నాలాంటి మరొక అనాథకు నాలాంటి ఉన్నతస్థానాన్ని ఇవ్వడానికే నీ అడుగుజాడల్లో నడుస్తున్నాను. నన్ను ఆశీర్వదించు.


పొరపాటున నీ డైరీ చదివి ఉండకపోతే ఎప్పటికీ నాకు ఈ నిజం తెలుసుండేది కాదు. నీవు అంత భద్రంగా కాపాడుకున్న రహస్యాన్ని నీ గురించే వెల్లడించక నా మనసులో దాచుకున్నాను. కానీ అనాటి పరిస్థితులు వేరు, ఇప్పటి పరిస్థితులు వేరు. అక్కతికి ఏ సమస్యా రాకుండా పెంచుతాను. తనకి నీ ఆశీస్సులు అందించు.

గుండెలో గూడు కట్టుకున్న ఆవేదన అంతా కన్నీళ్లుగా మారి చెక్కిళ్లపై నుండి జారుతుండగా ఒక ఆత్మీయ స్పర్శ ఆ కన్నీళ్లను తుడిచింది.

ఆ స్పర్శలో నీకు నేనుండగా... దేనికీ భయం లేదు అనే భరోసా ఉంది. ఈ ప్రపంచంలో ఏ వ్యక్తికైనా కష్టసుఖాల్లో తోడుంటే మనసున్న వ్యక్తి లభించటం గొప్ప వరమంటానన్నేను.

నిజంగా... ఆనంద్ లభించడం నా రెండో అదృష్టం.

○



## ప్రీతీ సంబరం

**సొట్టబుగ్గల సుందరి ప్రీతీ జింతా ఈమధ్య అమెరికా వెళ్లింది. ఆ ట్రిప్‌లో అనుకోకుండా టెన్నిస్ స్టార్ సెరీనా విలియమ్సని కలిసిందిట. ఎప్పటి నుంచో సెరినా అంటే అభిమానం గల ప్రీతికి ఆమెతో కాసేపు మాట్లాడే అవకాశం దొరికిందిట. అంతే, బోల్డన్ని కబుర్లు చెప్పుకున్నారట. నిజంగా సెరీనాతో గడిపిన ఆ మధురక్షణాల్ని తను ఎప్పటికీ మరిచిపోలేను- అంటూ తెగ సంబరపడిపోతోంది ప్రీతి. తను ఇంత పెద్ద స్టార్ అయినా కూడా టెన్నిస్‌లో నంబర్ వన్ క్రీడాకారిణితో ముచ్చటించినందుకు కలిగిన ఆనందమే వేరంటోంది.**